ఆటల్లో ఆణిముత్యాలు

వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ప్రతిభ ఎక్కడున్నా వెలుగు చూస్తుంది. ముఖ్యంగా క్రీడలకు సంబంధించి గ్రామీణ విద్యార్థుల్లో ఎంతో మంది ప్రతిభావంతులున్నారు. అలాంటి వారికి సరైన శిక్షణ ఇవ్వడంతోపాటు మెళుకువలు నేర్పితే పతకాలు సాధిస్తూ ఉన్నత స్థితికి చేరుకుంటారు. ఇందుకు పేదరికం అడ్డుకాదని, నిరంతర సాధన, విజయం సాధించాలన్న పట్టుదల, కాంక్ష ఉంటే చాలని చాటి చెబుతున్నారు ఈ క్రీడాకారులు.

- జంప్ రోప్‌లో రాణిస్తున్న మైదుకూరు విద్యార్థులు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు
- ఈనెల 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయినులతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మైదుకూరు : సరదా కోసం.. ఆ తర్వాత శారీరక వ్యాయామం కోసం ఆడుతూ వచ్చిన రోప్ స్కిప్పింగ్ క్రమేణా జంప్ రోప్‌గా అవతారమెత్తి క్రీడగా మారింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించే దశకు చేరుకుంది. ఈ క్రీడలో రాణిస్తూ మైదుకూరులోని జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయినులు ఎస్.వినోనియా రాణి, వి.చంద్రావతి శిక్షణ, ప్రోత్సాహంతో వీరు ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు మైదుకూరు హైస్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గతేడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జంప్ రోప్ పోటీల్లో పాల్గొని మైదుకూరు హైస్కూల్ విద్యార్థులు 38 పతకాలను సాధించారు.

అంతర్జాతీయ పోటీలకు..

గత అక్టోబర్‌లో తెనాలిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో హైస్కూల్ విద్యార్థి మహమ్మద్ బాషా ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. అక్కడ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మహమ్మద్ బాషాను అప్పటి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అభినందించి రూ.50 వేలు నగదును బహుమతిగా అందించారు. స్థానిక ముస్లిం సేవా సమితి నాయకులు అభినందించడమేగాక రూ.50 వేల నగదు బహుమానాన్ని పోలీసు అధికారుల ద్వారా అందజేశారు. థాయిలాండ్‌లో జరిగిన జంప్ రోప్ అండర్-17 పోటీల్లో మహమ్మద్ బాషా పాల్గొని పాఠశాలకు, మైదుకూరుకు గుర్తింపు తీసుకొచ్చాడు. జంప్ రోప్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 8 జాతీయ పతకాలను సాధించారు. భీమవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 జంప్‌రోప్ పోటీల్లో కడప జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని పొందింది. ఆ జట్టులో మైదుకూరు హైస్కూల్‌కు చెందిన మహమ్మద్ బాషా, ఆరిఫ్, హరీశ్వర్‌లు సభ్యులుగా ఉన్నారు. ఈ ఏడాది మార్చిలో బద్వేలులో జరిగిన అంతర్ జిల్లాల జంప్ రోప్ పోటీల్లో మైదుకూరు హైస్కూల్ నుంచి 13 మంది పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న నవీన్, హరీష్ అనే విద్యార్థులు ప్రతిభ చూపి మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆ పోటీల్లో ప్రతిభ చూపిన హరీష్ ఆగస్టులో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ఎంపికైన 300 మందికి గోవాలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో హరీష్ పాల్గొన్నాడు.



అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మహమ్మద్ బాషాను అభినందిస్తున్న పోలీసులు



మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొన్న హరీష్, నవీన్

మరింత ప్రోత్సహిస్తే..

ఈ నెల 15న మైదుకూరులో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించగా జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి 12 మంది జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నవీన్, లతీఫ్, సోహైల్, ముఖేష్, ముజీబ్ రెహ్మాన్, ముబారక్, విఘ్నేష్, హరీష్, అమీన్, హతీక్, నారాయణ సోహిత్, వసీమ్ అనే వారు ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరిగే 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులతోపాటు ప్రజాప్రతినిధులు మరింత ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేస్తారనడంలో అతిశయోక్తి లేదు.

ప్రభుత్వం శిక్షణ ఇప్పిస్తోంది



జంప్‌రోప్‌లో రాణిస్తున్న మైదుకూరు హైస్కూల్ విద్యార్థులను ప్రతి ఒక్కరూ మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఈ క్రీడకు ఎంతో ప్రోత్సాహం లభిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన వారికి శిక్షణ ఇప్పిస్తోంది. మైదుకూరు హైస్కూల్ విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంది. అందువల్లే వారు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు.

- ఎస్.వినోనియా రాణి, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీ బాలుర హైస్కూల్, మైదుకూరు

జంప్ రోప్‌తో మరింత ఏకాగ్రత



జంప్ రోప్ క్రీడతో విద్యార్థులకు మరింత ఏకాగ్రత పెరుగుతుంది. శారీరక దారుఢ్యంతో పాటు చురుకుదనం, క్రమశిక్షణ ఏర్పడుతుంది. అందువల్లే జంప్‌రోప్‌లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. వారు అందులో పాల్గొని ప్రతిభ కనబరుస్తుండటం సంతోషం. వారి తల్లిదండ్రులు కూడా బాగా ప్రోత్సహిస్తున్నారు.

- వి.చంద్రావతి, ఫిజికల్ డైరెక్టర్, జెడ్పీ బాలుర హైస్కూల్, మైదుకూరు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ఆకులనారాయణపల్లెలో పీర్ల ఊరేగింపు

కాశినాయన : హిందూ, ముస్లింలు కలిసికట్టుగా జరుపుకొనే మొహర్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగ అయినా పలు గ్రామాల్లో హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి పండుగలతో సమానంగా జరుపుకొంటారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామంలో గురువారం మొహర్రం పండుగను ఘనంగా జరుపుకొన్నారు. పీర్ల స్నానానికి వెళుతున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బొరుగులు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు ప్రదర్శించిన వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. యువకులు అగ్నిగుండంలో నడిచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

5న జానపద ఉత్సవాలు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 5న ఉదయం 9 గంటలకు ప్రపంచ జానపద కళాదినోత్సవం సందర్భంగా జానపద ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మన సంస్కృతి కళా సంస్థ గౌరవ సలహామండలి సభ్యులు, జానపద కళల పరిశోధకులు డాక్టర్ మూలె రామమునిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. జానపద కళలపై ఆసక్తి ఉన్న వారు కార్యక్రమంలో పాల్గొని జానపద గీతాలను అసభ్యకరంగా కాకుండా ఉండే పాటలు పాడవచ్చునని తెలిపారు. పాల్గొనే కళాకారులు సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప సెల్ నంబర్ 9618489171 సంప్రదించాలని కోరారు.

అన్నదానం



వృద్ధాశ్రమంలో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని మడూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మడూరు ప్రతాప్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పలు ఆశ్రమాల్లో గురువారం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మడూరు ప్రతాప్‌రెడ్డి కుమారుడు విజయకుమార్‌రెడ్డి పల్లవోలులోని కాశినాయన వృద్ధాశ్రమం, ప్రొద్దుటూరులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం, విద్యార్థి ఫౌండేషన్ చిన్న పిల్లల ఆశ్రమాల్లో అన్నదానం కార్యక్రమం నిర్వహించి వృద్ధులకు, పిల్లలకు నూతన వస్త్రాలు అందించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. స్థానిక ఆదిత్య హైస్కూల్‌లో గురువారం సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరియాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ ఆలీం, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి డయేరియా వ్యాధి లక్షణాలు, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హైస్కూల్ కరస్పాండెంట్ మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, హెచ్ఈఓ సుబ్బరాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, గోవిందరెడ్డి, పీడీ శ్యామ్యూల్, ఉపాధ్యాయులు, సచివాలయ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



సచివాలయం వద్ద చెత్త తొలగిస్తున్న ఎస్ఐ, గ్రీన్ అంబాసిడర్లు

రాజుపాళెం : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజుపాళెం ఎస్ఐ తులసీనాగప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ ఆదేశాల మేరకు గురువారం టంగుటూరు గ్రామంలోని పాత సచివాలయం వద్ద మద్యం సీసాలు, అపరిశుభ్రంగా ఉన్న చెత్తా చెదారాన్ని గ్రీన్ అంబాసిడర్లతో కలసి ఆయన తొలగించారు. కార్యక్రమంలో పోలీసులు సుధాకర్, నరేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజుపాళెంలో గ్రామస్తులకు గొడవలు చేసుకోవద్దని ఎస్ఐ అవగాహన సదస్సు నిర్వహించారు.

నేడు అమ్మవారికి చందనాలంకారం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం 3వ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి విశేషంగా చందన అలంకారం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆధార్ ప్రత్యేక శిబిరం

బద్వేలు అర్బన్ : ఆధార్ ప్రత్యేక శిబిరం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గుంతపల్లె, మడకలవారిపల్లె, పూసలవాడ, కోటవీధి, గాంధీనగర్ సచివాలయాల్లో ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించనున్న ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లో 5 ఏళ్లలోపు పిల్లలకు కొత్త ఆధార్ నమోదు, మొబైల్ నంబర్, ఇ-మెయిల్ ఐడీ లింక్, ఆధార్‌లో చేర్పులు, మార్పులు వంటి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

30న ఉపాధి ప్రజావేదిక

ప్రొద్దుటూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 30న ఉదయం 10 గంటలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు సామాజిక తనిఖీ జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ తనిఖీలో గుర్తించిన అంశాలపై ఈనెల 30న ప్రజావేదిక ఏర్పాటు చేశామని, కార్యక్రమానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్లను మున్సిపాలిటీలోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు విజయకుమార్, సాల్మన్

ప్రొద్దుటూరు : స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్లను మున్సిపాలిటీలోకి తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్లుగా పని చేస్తున్న 35 మంది సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా 9 మందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. స్వచ్ఛాంధ్ర క్యాబ్ డ్రైవర్ల పట్టణ కమిటీ నూతన అధ్యక్షుడిగా జూటూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రాయచోటి పవన్‌కుమార్, కోశాధికారిగా గజ్జల రాజకుమార్, ఉపాధ్యక్షులుగా ఇల్లూరు మహేష్ బాబు, ఎన్.సుబ్బరాయుడు, గాలిపోతుల విజయ రాజు, సహాయ కార్యదర్శులుగా మేకల మదన్, కొత్తపల్లి కిరణ్‌కుమార్, కాసుల తరుణ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ క్యాబ్ డ్రైవర్లకు మున్సిపాలిటీలో ఇచ్చే డ్రైవర్లకు మాదిరిగానే జీఓ నంబర్ 39 ప్రకారం వేతనం రూ.24,500 ఇవ్వాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ, వేతనాలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, యూనిఫాం ఇవ్వాలన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన డీటీఎఫ్



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్(డీటీఎఫ్) టీం సభ్యులు విజిట్ చేశారు. ఈ సందర్భంగా గర్భవతులు, చిన్న పిల్లలకు అందుతున్న వివిధ రకాలైన టీకాలు, వైద్య సేవల వివరాల రికార్డులు, కంప్యూటర్ ఆన్‌లైన్‌లో వైద్య సేవల నమోదును పరిశీలించారు. గర్భవతులకు రక్త శాతం, వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఇదే క్రమంలో ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకం గర్భవతులకు అందే విషయంపై ఆరా తీశారు. ఇదే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను విజిట్ చేసి అక్కడ అందే సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించడంపై పలు రకాలైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, వైద్యాధికారి సంపత్ కుమార్, డీపీహెచ్ఎన్ఓ అరుణ, సీహెచ్ఓ సాంబశివారెడ్డి, ఎన్‌హెచ్ఎం నారాయణ, ఏఎస్ఓ జాకోబ్, సూపర్‌వైజర్లు పుష్పరాజు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడటంతోపాటు అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబ్జాలకు సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సి.కొత్తపల్లె పొలం, బేతాయపల్లె పంచాయతీ గ్రామ పొలం, ఎన్‌జీవో కాలనీ, చెన్నంపల్లె పొలం, రంగసముద్రం రెవెన్యూ పంచాయతీ, మడకలవారిపల్లె గ్రామ పొలంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, దీనిపై న్యాయవిచారణ జరిపించాలని కోరారు. తొలుత నెల్లూరు రోడ్డులోని సీపీఐ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు పి.వి.రమణ, రవికుమార్, విజయమ్మ, కేశవ, పెంచలయ్య, ఇమ్మానియేల్, భగత్‌సింగ్ కాలనీ కన్వీనర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఏషియన్ ఇన్‌స్టిట్యూట్'తో ఎంఓయూ



ఎంఓయూ పత్రాలు ప్రదర్శిస్తున్న సీబీఐటీ యాజమాన్యం

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) థాయ్‌ల్యాండ్ లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎంఓయూ) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సీబీఐటీ కరస్పాండెంటు డా.వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ 1959లో స్థాపితమైన బ్యాంకాక్‌లో థాయ్‌ల్యాండ్‌కు చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో ఎంఓయూ చేసుకోవడం వల్ల నూతన టెక్నాలజీలో విద్యాబోధన అభ్యసించడానికి సీబీఐటీకి మంచి అవకాశం లభిస్తుందన్నారు. ఇక్కడి విద్యార్థులు థాయ్‌ల్యాండ్‌కు వెళ్లే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టు, రీసర్చ్, ఉన్నత చదువులతోపాటు మాస్టర్ డిగ్రీస్ చదువుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులకు నూతన విద్యా విధానాలతోపాటు ఉజ్వల భవిష్యత్తు అందివ్వడంలో ఈ ఎంఓయూ చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్మృతి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

బ్రహ్మంగారిమఠం : మండలంలోని డి.నేలటూరులో గురువారం నవభారత్ ఫెర్టిలైజర్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగేంద్ర వెంకటకృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయం రంగంలో సేంద్రియ ఎరువులు వాడటం వల్ల పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చాపాడు : డయేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరస్పాండెంటు బి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నగురువళూరులో గల శ్రీ స్వామి వివేకానంద హైస్కూల్‌లో విలేజ్ హెల్త్ క్లీనిక్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం డయేరియా వ్యాధి వ్యాప్తి పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ క్లీనిక్ సీహెచ్ఓ శివమ్మ మాట్లాడుతూ కాచి వడగట్టిన నీటిని తాగాలన్నారు. అనంతరం గ్రామంలోని వీధుల వెంట విద్యార్థులు నినాదాలతో ర్యాలీ చేస్తూ డయేరియా పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

మైదుకూరు : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని కోరుతూ గురువారం మైదుకూరు లిటిల్ స్కాలర్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని, గో గ్రీన్ సేవ్ లైఫ్ నినాదాలు చేస్తూ విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ చెట్ల పాముఖ్యతను వివరించారు.

27 నుంచి డీవైఎఫ్ఐ శిక్షణ తరగతులు

బద్వేలు అర్బన్ : నంద్యాలలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని పేర్కొన్నారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో నిరుద్యోగ యువత సమస్యలపైన, జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధనకు ఈ శిక్షణా తరగతుల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, మహిళా కో కన్వీనర్ నాగలక్ష్మి, పట్టణ నాయకులు ఆంజనేయులు, నాగేంద్ర, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్ : జనసైనికులు పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని తీసుకోవాలని జనసేన నాయకులు జిలాన్‌బాష, విజయ్‌కుమార్, సుధీర్, చౌసేన్‌వలి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 28 వరకు 4వ విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. మరిన్ని వివరాలకు 9290000527, 8309650163 నంబరులకు సంప్రదించాలని కోరారు.

వైభవంగా హుసేన్‌పీర్ దర్గా ఉరుసు



గంధం తీసుకువస్తున్న స్వామి వారసులు



దర్గాను సుందరంగా అలంకరించిన దృశ్యం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దర్గా వీధిలో వెలసిన హుసేన్ పీర్ దర్గా 199వ ఉరుసు మహోత్సవాలు స్వామి వారసులు సయ్యద్ మహమ్మద్ కరిముల్లా హుస్సేన్‌షా ఖాదిరి ఆధ్వర్యంలో రెండవ రోజైన గురువారం ఘనంగా జరిగాయి. ఉరుసు సందర్భంగా బద్వేలు నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో దర్గా ఆవరణమంతా భక్తులతో కిక్కిరిసింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారసులు గంధం ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి స్వామి సమాధికి ఎక్కించి అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ఆవరణలో మొక్కుబడి ఉన్న భక్తులు అన్నదానం నిర్వహించారు. చివరిరోజు కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

రాత్రి ఏర్పాటు చేసిన ఖవ్వాలి కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే ఫకీరుల విన్యాసాలు అబ్బురపరిచాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అర్బన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్వామి వారసులు దర్గారహమతుల్లా, దర్గామున్వర్, దర్గాషఫివుల్లా, దర్గాసలీం, ఆర్గనైజర్లు అన్వర్‌బాషా, షరీఫ్, అంజాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి

గోపవరం : మహిళలు పోష్ చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.శ్రీదేవి పేర్కొన్నారు.

గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు పోష్ యాక్ట్ కింద నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల బాధిత మహిళ లేదా ప్రతివాదిని వేరే ప్రదేశానికి బదిలీ చేసే అవకాశం ఉంటుందని, ఈ చట్టం ద్వారా మహిళలు సురక్షితమైన వాతావరణంలో పనిచేయడానికి వీలుంటుందని తెలిపారు. ఎంపీడీఓ రాధాకృష్ణన్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల చట్టం పోష్ యాక్ట్ 2013ను పటిష్టంగా అమలు చేయడానికి కృషి చేయాలన్నారు. వేధింపులకు గురైన మహిళలు మండల స్థాయిలో తహసీల్దారుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచాలని, నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయలేని పరిస్థితుల్లో ఫిర్యాదు ఇవ్వడానికి అన్ని కార్యాలయాల్లో ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ హసీనా, డిప్యూటీ తహసీల్దారు చంద్రకళ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయానికి 8 సూత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న గురు బ్రహ్మయ్య

ప్రొద్దుటూరు : స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ప్రతినిధి ఓ.గురు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో విజయానికి 8 సూత్రాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ధారణాశక్తిని పెంపొందించుకుని ప్రగతి పథంలో పయనించాలన్నారు. మొదడుకున్న శక్తిని గుర్తించడం, ఆలోచనాతీరును మార్చుకోవడం, ధారణాశక్తిని అభివృద్ధి చేసుకోవడం ఎలాగో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు తమను తాము మార్చుకుని ప్రపంచాన్ని కొత్త దృష్టి కోణంతో చూస్తూ విజయం సాధించడం ఎలాగో నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.హుస్సేన్‌రెడ్డి, ఎంవీపీ ప్రసాద్, ఏఓ ఎం.రజనీకాంత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైద్యశిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని శ్రీ చౌడేశ్వరి తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో శని, ఆదివారాల్లో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ సాదిక్‌బాష తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీనమైన వర్మ కళాచికిత్స వంటి 21 పద్ధతులతో బెంగళూరు, హైదరాబాదుకు చెందిన 10 మంది వైద్యనిపుణుల ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. మోకాళ్లనొప్పి, నడుంనొప్పి, పక్షవాతం, సయాటిక, సైనసైటిస్, సర్వైకల్ స్పాండిలోసిస్ తదితర వాటికి వైద్య సేవలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు: 9343937299, 8310446401లకు సంప్రదించాలన్నారు. ఆయుర్వేద వైద్యుడు సుబ్రమణ్యం, ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, స్నేహసేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చాపాడు : సోమాపురం పంచాయతీ మొరాయిపల్లె సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,300 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.